క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: పెదముషిడివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈపీడీసీఎల్ ఏఈ వినోద్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో పెదముషిడివాడ, కన్నూరు, మంత్రిపాలెం, లంకెలపాలెం, శ్రీరామనగర్ కాలనీ, గంజిపేట, గొన్నవానిపాలెం, ఈ.మర్రిపాలెం గ్రామాలకు మధ్యాహ్నం రెండు గంటల తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని ఏఈ చెప్పారు.

104 వాహనం ప్రారంభం నేడు

సబ్బవరం: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతనంగా 104 వాహనం వచ్చినట్లు పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాన్ని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేషంగా అభిషేకాలు

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో వేంజేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

బీజేపీ పెందుర్తి కన్వీనర్‌గా గొర్లె


గొర్లె రామునాయుడు

సింహాచలం: బీజేపీ పెందుర్తి నియోజకర్గ కన్వీనర్‌గా ఆ పార్టీ సీనియర్ నేత గొర్లె రామునాయుడు నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు రామునాయుడు పెందుర్తి నియాజకవర్గ బీజేపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న పలు అసెంబ్లీ నియోజకర్గాలకు కన్వీనర్లు, కో కన్వీనర్లను బీజేపీ అధిష్టానం నియమించింది. ఈమేరకు పెందుర్తి నుంచి గొర్లె రామునాయుడును కన్వీనర్‌గా నియమించారు. తనకు కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన బీజేపీ అధిష్టానానికి, రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుకు రామునాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

'రామాయణ సంగ్రహము' గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: రచయిత ఆదూరి భీమారావు రచించిన రామాయణ సంగ్రహము గ్రంథావిష్కరణ సభ స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ప్రసన్నభారతి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమారావు 90 ఏళ్ల వయస్సులో గ్రంథాన్ని రాయడం అభినందనీయమన్నారు. సభాధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ వాల్మీకి రామాయణం ఈ సృష్టి ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. శాశ్వత విలువలు రామాయణంలో ఉన్నాయని, వేదమే రామాయణంగా అవతరించిందన్నారు. ప్రముఖ సాహితీవేత్త డి.వి.సూర్యారావు గ్రంథ సమీక్ష చేశారు. కేవలం కథ చెప్పడమే కాకుండా కథా ఘట్టాలను, పాత్రలను విమర్శ దృష్టితో పరిశీలించారని ప్రతి కాండ సారాన్ని చక్కని విశ్లేషణతో అందించారన్నారు. రచయిత భీమేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని వ్యాఖ్యానాలు ఆధారంగా గ్రంథ రచన చేశానని తెలిపారు. సంస్థ ప్రతినిధి సర్వేశ్వర ప్రసాద్ పర్యవేక్షించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించా రు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ కొల్లి సింహాచలం పాల్గొన్నారు.

ప్రజలు, ఉద్యోగుల సహకారంతో ప్రగతి పథం

- ఎన్టీపీసీ జీజీఎం సిన్హా
- చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు అందజేసిన ప్రజాప్రతినిధులు


స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులతో జీజీఎం సిన్హా

పరవాడ: నిర్వాసిత గ్రామాల ప్రజలు, ఉద్యోగుల సహకారంతో సింహాద్రి ఎన్టీపీసీ అభివృద్ధి పథంలో నడుస్తుందని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్‌లో నిర్వహించిన స్టేక్ హోల్డర్స్ (వాటాదారులు) సమావేశంలో ఆయన మాట్లాడారు. పరవాడ మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సీఎస్సార్ నిధులతో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు అండగా ఉంటామన్నారు. నిర్వాసిత గ్రామాల్లో సీఎస్సార్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను జీజీఎం వివరించారు. గా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. అందుకు అవసరమైన కార్యక్రమాలు సంస్థ చేపడుతుందని జీజీఎం సిన్హా చెప్పారు.

ప్రతిపాదనలు అందజేత

సమావేశంలో పాల్గొన్న పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు తమ గ్రామాలకు అవసరమైన వసతులు కల్పించాలని ప్రతిపాదనలు అందజేశారు. సమావేశంలో ఏజీఎం హెచ్‌ఆర్ రుమాడిశర్మ, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఈవోఆర్డీ పద్మజ, ఎంఈవో సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ, వ్యవసాయాధికారి చంద్రావతి, పంచాయతీరాజ్ ఏఈ రామారావు, వాడచీపురుపల్లి, పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు కనకప్పారావు, ఐ.ఆర్.రంజిత్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జంగాలపాలెం సర్పంచ్ చెక్‌పవర్ కట్

సింహాచలం: పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన పెందుర్తి మండలం జంగాలపాలెం సర్పంచ్ గొరపల్లి నరసింగరావు చెక్ పవర్ తాత్కాలికంగా నిలిపివేస్తూ జిల్లా పంచాయతీ అధికారి జి. అప్పలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ సాధారణ నిధులతో నిర్మించిన జీఎస్‌బీ రోడ్డు విషయంలో నరసింగరావు అవకతవకలకు పాల్పడ్డారని నిర్ధారించారు. జంగాలపాలెం పంచాయతీ సాధారణ నిధులతో విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని అనుమతులు లేని లేఅవుట్‌లో రోడ్డు వేసి నరసింగరావు నిధులు దుర్వినియాగం చేశారని అదే గ్రామ మాజీ సర్పంచ్ గొరపల్లి సాంబ ఫిర్యాదు చేశారు. ఈమేరకు పెందుర్తి ఈవోఆర్డీ అప్పారావు విచారణ చేశారు. రూ. 3.40లక్షలతో 196.5మీటర్లు వేసిన రోడ్డులో 124.50 మీటర్లు విశాఖజిల్లా పరిధిలో ఉందని, మిగిలిన 72 మీటర్లు విజయనగరం జిల్లా చింతలపాలెం గ్రామపంచాయతీలో ఉందని నిర్ధారించారు. ఈమేరకు నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించారు. దీంతో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్ గొరపల్లి నరసింగరావు చెక్‌పవర్ రద్దు చేసి, 15 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని డీపీవో అప్పలరాజు ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు మూడో విడత 'ఆసరా' సంబరాలు


కోన రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు, పరవాడ

పరవాడ: స్థానిక సంతబయలులో బుధవారం ఉదయం 9 గంటలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు చెప్పారు. మంగళవారం వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా చెక్కులు అందజేస్తారని చెప్పారు. సమావేశంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బి.అప్పలరాజు పాల్గొంటారని తెలిపారు. మండలంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని రామారావు కోరారు.

అనకాపల్లి సబ్‌డివిజన్‌లోకి సబ్బవరం, పరవాడ


ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామారావు తదితరులు

సబ్బవరం: రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ అధిక దిగుబడులు సాధించే విధంగా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సూచించారు. ఇప్పటి వరకూ విశాఖపట్నం అగ్రికల్చరల్ సబ్ డివిజన్‌లో ఉన్న సబ్బవరం,పరవాడ మండలాలను అనకాపల్లి అగ్రికల్చర్ సబ్ డివిజన్‌లో చేర్చారు. దీనిలో భాగంగా అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం. రామారావు మంగళవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను రాంపురంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సబ్బవరం,పరవాడ మండలాల్లో రబీ సీజన్‌లో పండిస్తున్న పంటల సరళిని, వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కష్టం హైరింగ్ సెంటర్ల గురించి వివరించారు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో సబ్బవరం మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు బైలపూడి భగవాన్ జయరాం, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ నాయకులు బోకం రామునాయుడు, బోను గంగునాయుడు, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఏఈవో శ్రీను పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: పౌష్టికాహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు.మండలంలోని మొగలిపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న కిట్లతో కూడిన ఎగ్జిబిషన్‌ను ఆమె తిలకించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు,బాలింతలు ,చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుందన్నారు. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న బాలామృతం,పాలు,గుడ్లు,సంపూర్ణ భోజనం,వైఎస్సార్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత, పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ గండి మహాలక్ష్మి,ముత్యాలనాయుడు, సూపర్ వైజర్ స్వర్ణ, పంచాయతీ కార్యదర్శి పి. సంతోషి పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


గరుడవాహనంపై అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి


యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు శ్రీ వరాహ నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మంపడంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు,ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు చిన్నా తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తి గోవింద రాజస్వామిని అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

రోడ్లు ఇలా.. రాకపోకలెలా!


అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిలోని అసకపల్లి మలుపు వద్ద దెబ్బతిన్న రోడ్డు


సబ్బవరం-లంకెలపాలెం రోడ్డులో అసకపల్లి వద్ద గుంతలమయంగా రోడ్డు

సబ్బవరం: మండలంలో అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. దీంతో వాహనాల రద్దీ విపరీతంగా పెరగిపోయింది.అయితే సబ్బవరంలోని గుల్లేపల్లి జంక్షన్ నుంచి అసకపల్లి జంక్షన్ వరకూ ఉన్న జాతీయ రహదారి పనులు ప్రస్తుతం సాగుతున్నాయి. దీంతో ప్రస్తుతం సబ్బవరం మీదుగా ఉన్న పాత రోడ్డుపై వాహనాలు రద్దీ అధికంగా ఉండటంతో పాటు భారీ వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఫలితంగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో తరుచూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజా ప్రతినిదులు చొరవ తీసుకుని రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

- పరవాడలోని పరిశ్రమలకు సబ్బవరం మీదుగా జాతీయ రహదారి నుంచి సబ్బవరం–లంకెలపాలెం రోడ్డులో ప్రయాణిస్తున్న భారీ వాహనాలతో రోడ్డు తీవ్రంగా దెబ్బతింది.దీనితో అసకపల్లి సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారింది. వాహన చోదుకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ


విద్యార్థులకు రాగి మాల్ట్ అందిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అగనంపూడి: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూచించారు. పరవాడ మండలంలోని పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భాగంగా అందిస్తున్న రాగి మాల్ట్‌ను విద్యార్థులకు అందించి, రుచిపై ఆరా తీశారు. బైజూస్ యాప్ ద్వారా ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందుతున్న పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. పరీక్షలు అయ్యేవరకు టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ప్రణాళికాయుతంగా చదువుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారావు, ఉపాధ్యాయులు పెద్దినాయుడు, కోటేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ ఆసక్తి వ్యక్తీకరణ ఉపసంహరించాలి'

ఉక్కునగరం: ముడి సరకు కోసం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) ప్రకటనను ఉపసంహరించాలని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి ఫగ్గాన్ సింగ్ కులస్తేను ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. న్యూఢిల్లీలో ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. బ్లాస్ట్ ఫర్నేస్–3లో ఉత్పత్తి పునరుద్ధరించడానికి విడుదల చేసిన ఈవోఐ ప్రభుత్వరంగ సంస్థ మనుగడకు ముప్పు అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థగా సొంత నిధులతో చేయాల్సిన ఉత్పత్తిని ఈ విధమైన ఈవోఐగా చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్య రామ్, కె.ఎస్.ఎన్. రావు, వై. మస్తానప్ప, వరసాల శ్రీనివాసరావు, జి. గణపతిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

స్టీల్‌ప్లాంట్ సమస్యలను పరిష్కరించాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తేను కోరారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి. తౌడన్న నేతృత్వంలో న్యూఢిల్లీలో మంత్రిను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు పుల్లారావు, ఎస్. మోహన్ బాబు, డి.సువర్ణరత్నం తదితరులున్నారు.

రాగిజావ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ


క్వీన్‌మేరీ స్కూల్లో రాగిజావ పంపిణీని పర్యవేక్షిస్తున్న హెచ్ఎం ధర్మేంద్రరెడ్డి

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న రాగిజావ పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య (ఇంటర్వెల్ సమయంలో) విద్యార్థులకు రాగిజావ ఇచ్చేలా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. జిల్లాలోని 587 పాఠశాలల్లో అమలు చేస్తుండగా, 87,861 మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. రోజుకో రుచికరమైన వంటకంతో జగనన్న గోరుముద్ద పథకం అందిస్తూనే, విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేకంగా రాగిజావ ఇస్తున్నారు. బెల్లం పొడి కలిపిన రాగిజావ ఎంతో రుచికరంగా ఉండటంతో దీనిని తీసుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పరిశుభ్రమైన వాతావరణంలో రాగిజావ తయారు చేసేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయంతో కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఐక్య ఉద్యమాలతో పరిశ్రమను పరిరక్షించుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 775వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగంగా యాజమాన్యం ఉత్పత్తికి కావలసిన ముడి సరకులను సమకూర్చడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రోజుకో విభాగంలో ఉత్పత్తిని నిలిపివేస్తూ, కొన్ని విభాగాలను ప్రైవేటు వారికి కట్టబెట్టాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. సొంత గనులు లేకపోయినా వేల కోట్లు లాభాలను చేకూర్చడమే కాక.. ఎన్నో కష్టాలను అధిగమించి అంకితభావంతో ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచితే, నేడున్న యాజమాన్యాలు తిరోగమన దిశగా ఉత్పత్తిని తగ్గించుకుంటూ సంస్థను నష్టాల బారిన పడేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

టెక్‌ఫెస్ట్‌లో గైస్ విద్యార్థుల ప్రతిభ


కాలేజీ అధ్యాపకులతో టెక్‌ఫెస్ట్‌లో ప్రతిభా ధ్రువపత్రాలు అందుకున్న గైస్ విద్యార్థులు

మురళీనగర్: కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెక్ ఫెస్ట్‌లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) విద్యార్థులు ప్రతిభను చాటారు. వీరు 8 గ్రూపులుగా తమ సృజనాత్మక పరిశోధనలకు సంబంధించిన ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శించారు. రెండు గ్రూపులు పోస్టర్ ప్రదర్శన విభాగం, ఆరు గ్రూపులు పేపర్ ప్రజంటేషన్ (పరిశోధనా పత్రం) విభాగాల్లో పాల్గొన్నారు. వీరిలో 5 గ్రూపులు బహుమతులు గెలుచుకున్నాయి. బి.ప్రణీత, సీహెచ్ మేఘన, జి.మెర్సీ, ఎల్ మురళీకృష్ణారావుల బృందం ఆయిల్ అండ్ గ్యాస్ ఇండస్ట్రీకి సంబంధించి పోస్టర్ ప్రదర్శనలో మొదటి బహుమతి, గ్రీన్ కెమికల్స్ విభాగంలో బి.ప్రియాంక, అంజలి కుమారి, పి.జాహ్నవి బృందం పేపర్ ప్రజెంటేషన్‌లో మొదటి స్థానం, ఇదే విభాగంలో బి.హరి శంకర్, బి.నిత్యప్రకాష్, ఎంవీ నరేష్ వర్మ బృందం ద్వితీయ బహుమతి, కార్బన్ సీక్వెస్ట్రేషన్ విభాగంలో వై.హర్ష, పి.లక్ష్మణ్‌చరణ్, కె.దుర్గా ప్రసాద్‌ల బృందం పేపర్ ప్రజెంటేషన్‌కు ద్వితీయ బహుమతి, సబ్–సీ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో జయంతి శ్రావణ శృతి, ఎల్. తేజసాయి, వి.జ్ఞానేశ్వర్ బృందం పేపర్ ప్రజెంటేషన్‌కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా కాలేజీలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఇతర సిబ్బంది అభినందించారు.

గ్రూప్–1 పరీక్ష వాయిదాపై హర్షం

ఎంవీపీ కాలనీ: గ్రూప్–1 ప్రధాన పరీక్షను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేయడంపై నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వానికి, వాయిదా దిశగా కృషి చేసిన మంత్రి బొత్స సత్యనారాయణకు ఆయన ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. వాయిదాతో శిక్షణకు అభ్యర్థులకు మరికొంత సమయం లభించిందన్నారు. ఎస్సై, కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షల్లో ప్రశ్నపత్నంలో లోపాల నేపథ్యంలో సచివాలయ పరీక్షల తరహాలో 15 గ్రేస్ మార్కులు కలపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ వయోపరిమితి పెంచి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

విధినిర్వహణలో అప్రమత్తత అవసరం


భద్రతా ప్రతిజ్ఞ చేస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో జాతీయ ఉక్కు భద్రతా దినోత్సవం (స్టీల్ సేఫ్టీ డే)ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) బి.కె. మొహంతి ముఖ్య అతిథిగా హాజరై, భద్రతా జెండాను ఎగురవేశారు. హాజరైన వారితో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భద్రతతో విధులు నిర్వహించడం ద్వారా ప్రమాదరహిత పరిశ్రమగా స్టీల్‌ప్లాంట్‌ను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో సీజీఎంలు సారంగి, యు. శ్రీధర్, సిహెచ్. శ్రీనివాస్, ఎస్.వి. స్వామి, సోబ్తీ, పలువురు జీఎంలు, వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు, సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.